# 'ఏరాయి 'ఏంచా...?

**ఆచంట హైమవతి**

"చీకటిపడుతూంటే ఇప్పుడెక్కడికే బయల్దేరావ్?'' ప్రతిమని ప్రశ్నించింది తల్లి సుగుణ.

''సైన్స్ నోట్సు తెచ్చుకోవాలమ్మా శ్రావ్య దగ్గర్నుంచి. కాలేజీలోనే అడిగాను దాన్ని. ఇస్తానంది. కాని ఇంటికొచ్చేటప్పుడు మళ్ళీ అడగటం నేనే మర్చిపోయాను. అలా మర్చిపోయినందుకు పనిష్మెంట్! చచ్చినట్లు ఇప్పుడెళ్ళి తెచ్చుకోవాలి.రేపు ఆ నోట్సు అవసరం చాలా ఉంది'' బయల్దేరుతూ అంది ప్రతిమ.

''ఒంటరిగా వెడుతున్నావ్ జాగ్రత్త! తొందరగా వచ్చెయ్'' అందామె. 'ఈ పిల్లముద్దు ఇంటికి వచ్చే వరకూ టెన్షన్ నాకు!' మనస్సులోనే విసుక్కుంది.

నిజానికి ఆ నోట్సు రేపు అడిగి తెచ్చుకోవచ్చు. కాని... ప్రతిమ ఇప్పుడు ఇలా శ్రావ్య ఇంటికి వెళ్ళటానికి వేరే కారణముంది. క్రితం రోజే శ్రావ్య అక్క కావ్య వచ్చింది పుట్టింటికి. కావ్య, శ్రావ్య కవలపిల్లలు. వరుని తాతమ్మ బతికి ఉండగా మునిమనుమడి పెళ్ళి చూస్తాననటంతో తప్పనిసరై కావ్యతో పెళ్ళి జరిపించాల్సి వచ్చింది.

అత్తవారింటికి వెళ్ళిన కావ్య పరీక్షలు దగ్గరకి వచ్చేస్తున్నాయని పేచీపెట్టి భర్త, అత్తమామల్నీ ఒప్పించి పుట్టింటికి వచ్చేసిందట. చదువు పూర్తైతేగాని పెళ్ళి చేసుకోనని కావ్య మొండిపట్టు పట్టింది. వరుడు కావ్యని ప్రత్యేకంగా కలుసుకుని బతిమాలటంతో ఆమె పట్టు సడలిపోయింది. అతని మాట కాదనలేక పెళ్ళికి ఒప్పేసుకుంది కావ్య.

మిత్రులందరూ 'అతడి వలలో పడిపోయావ్!' అంటూ ఏడిపించారు. అందుకు చాలా ఉక్రోషపడింది కావ్య. చదువు పూర్తిచేసి తన పంతం నెగ్గించుకోవాలని చాలా పట్టుదలగా ఉంది కావ్యకి.

శ్రావ్యకి, కావ్యకి పోలికల్లో ఒక్కటే చిన్న వ్యత్యాసం. కావ్య నవ్వుతూంటే బుగ్గలు సొట్టలు పడతాయి. ఆ అందం చూసి మనసుపారేసుకున్నాడు నిర్మల్. పెద్దవాళ్ళతో రాయబారం నడిపించాడు. పెళ్ళైంది.

''నవ్వితే నా బుగ్గలు సొట్టలు పడకపోవటంతో బతికిపోయానన్నమాట!'' అంటూ కావ్యని ఏడ్పిస్తూంటుంది శ్రావ్య.

స్ఫురద్రూపి, గంభీరమైన విగ్రహం గల నిర్మల్‌ని కాదనటానికి ప్రత్యేకమైన కారణం కనబడలేదు కావ్యకి. పెళ్ళై... అత్తవారింట్లో పదిహేనురోజులుండి, మెల్లిగా ధైర్యం చేసి అత్తారిని మంచిమాటలతో ఒప్పించి చదువుకుందుకు పుట్టింటికొచ్చింది కావ్య. బుద్ధిమంతురాలే!

అందుకు మనస్ఫూర్తిగా ఒప్పుకునే కావ్యని పెళ్ళికి ఒప్పించాడు నిర్మల్. ఇచ్చినమాట నిలబెట్టుకున్నాడన్నమాట నిర్మల్! బుద్ధిమంతుడే! స్నేహితురాల్లో ఏమైనా తేడా వచ్చిందా? పూర్వంలాగే ఉందా...? అనే కుతూహలంతో కావ్యని చూడటానికి బయల్దేరింది ప్రతిమ.

ఈ ఆలోచనల్లో మునిగివున్న ప్రతిమ రెండో మలుపు దగ్గరకూడా తననే అనుసరిస్తున్న ఒక ఆగంతకుణ్ణి గమనించి కంగారుపడింది. అవసరం లేకపోయినా ఇంకొక మలుపు తిరిగింది. అతడు కూడా మలుపు తిరిగాడు. రెండుసార్లు కుడివైపుకే మలుపు తిరిగి మళ్ళీ ఆ వీధిలోకే వచ్చింది ప్రతిమ. అతడు వెంబడించటం మానలేదు. ఇంకా కొంచెం దగ్గరయ్యాడు కూడా!

'ఛీ! అనవసర ఆలోచనల్తో నెమ్మదిగా నడుస్తూ వాణ్ణి గమనించలేదుగాని... చూడ్డానికి 'రౌడీ వెధవ' లాగున్నాడు. ఇప్పుడేం చెయ్యటం? జన సందడి కూడా తక్కువగా ఉందే ఇవేళ?!' మనస్సులోనే దిగులుగా అనుకుంది ప్రతిమ.

గబగబ నడవటం మొదలెట్టింది. వెనకాల అతడు కూడా నడక వేగం పెంచినట్లు

తెలుస్తోంది. గాబరాగా ఉండి తోచినట్లు మలుపులు తిరిగేస్తోంది ప్రతిమ.

నలుగురు ఆడవాళ్ళు ఎదురునుంచి వస్తున్నారు. వాళ్ళ సహాయం అడిగితే? అనుకొంది ఒక క్షణం. ఏమని చెప్పటం? తనను వెంబడిస్తున్నాడని చెప్తే... వాళ్ళు నమ్ముతారో లేదో? అతడు 'నా దోవన నేను పోతుంటే ఈ అమ్మాయి అపోహ పడుతోందని చెప్తే?...' ఇలా ఆలోచిస్తూ వుండగానే వాళ్ళు ప్రతిమని దాటిపోయారు. అతడు ఆ నలుగుర్ని చూసి నడక వేగం తగ్గించాడు. ప్రతిమ అమ్మయ్య! అనుకొనేలోగా మళ్ళీ వేగం పెంచాడతడు.

వదిన చెప్పినమాట నిజమే! అవసరం అయిన దాని కంటే ఎక్కువగానే ఆలోచిస్తుంది తను. లేకపోతే చీకటి పడ్డాకూడా పట్టించుకోకుండా ఇలా రావటం ఎందుకు బుద్ధి లేకుండాను? తనను తనే మందలించుకుంది.

'కావ్య స్నేహితులవద్ద సిగ్గుపడుతుందా? పెళ్ళైన అందరాడవాళ్ళలా హుందాగా ఉంటుందా? కావ్య భర్త... కావ్య, శ్రావ్యలను ఎలా గుర్తిస్తాడు? బుగ్గలు సొట్టలు కనిపెట్టడానికి అస్తమానం నవ్వుతూనే ఉండరు గదా?

శ్రావ్య అంటే...కావ్య భర్తకి ఎలాంటి ఆలోచనలుంటాయెూ? కావ్య భర్తంత అందగాడు శ్రావ్యకి భర్తగా దొరక్కపోతే... శ్రావ్య కావ్యమీద ఈర్ష్య పడుతుందా? అలాంటి స్థితి వస్తే శ్రావ్యని కావ్య అనుమానిస్తుందా? ఛీ... పాపం! అది అలాంటిది కాదులే...!'' వద్దనుకున్నా మిత్రుల్ని గురించిన ఆలోచనల్లో పడి నడుస్తున్న ప్రతిమ చెయ్యి ఎవరో పట్టుకుని ఆపారు.

గభాలున ఈ లోకంలో పడింది ప్రతిమ. వెనకాల వస్తున్నవాడే చెయ్యిపట్టుకున్నాడేమో అనుకుంది 'బేర్' మని అరిచేసింది భయంతో.

ప్రతిమ చెయ్యి పట్టుకున్నావిడ కూడా కంగారు పడి ప్రతిమ చేతిని వదిలేసి ''అదేమి టమ్మాయ్... అంత చెత్తలో నడిచి వెడుతున్నావ్? నీకు కళ్ళున్నాయో... లేదో... అని అనుమానం వచ్చి చెయ్యి పట్టుకున్నానంతే ఇంతలో 'బేర్'మన్నావ్! నేనేం చేశానని అంత కంగారు పడ్డావ్?'' అందావిడ వింతగా చూస్తూ.

ఆవిడకేం జవాబివ్వాలో తెలియక ''పెన్ పడిపోయింది. వెతుకుతున్నాను'' అంది అసందర్భంగా.

''అంత చెత్తగా వుంది... అందులో ఇంకెలా వెతుకుతావ్? కొత్త పెన్ కొనుక్కో పో!'' అంటూ ఒక ఉచిత సలహా ఇస్తూ వెళ్ళి

## తెలుగు

రాయల రాజసం తెలుగు
రామకృష్ణుని తెలుగులో జిలుగు
గిడుగు వారి మాట తెలుగు
గురజాడ భాష తెలుగు
నండూరి వారి ఎంకి తెలుగు
చిలకమ్మ ప్రహసనం తెలుగు
పానుగంటి వారి సాక్షి తెలుగు
ఆంధ్రుల అభిమాని బారిష్టర్ పార్వతీశం తెలుగు
కరుణశ్రీ వారి తెలుగు బాల తెలుగు
విశ్వనాధవారి వేయిపడగలు తెలుగు
దేవులపల్లి వారి ఊర్వశి తెలుగు
దాశరథి తిమిరంతో సమరం తెలుగు
జాషువా గబ్బిలం తెలుగు
దుగ్గిరాల వారి స్ఫూర్తి తెలుగు
పొట్టి శ్రీరాములు రాష్ట్ర ఉద్యమం తెలుగు
టంగుటూరి వారి శౌర్యం తెలుగు
కందుకూరి వారి హితవు తెలుగు
శంకరం బాడి దేశభక్తి తెలుగు
పింగళి వెంకయ్య రస స్ఫూర్తి తెలుగు
ఆకలేసిన పాపడు ఏడుస్తూ అమ్మా అని
పిలిచే పిలుపు తెలుగు
ఆప్యాయంగా ఎదుటివారిని అన్నా అన్న పిలుపు
తెలుగు
ఆత్మీయతతో తెలుగింటి ఆడపడుచును
అక అని పిలవడం తెలుగు
ఇన్నింటినీ కలబోసి ఇంతటి ఆత్మీయతనూ
పంచి వెరసి రంగుల హరివిల్లై ఆకసాన
జాబిల్లై నిత్యనూతనమై విరాజిల్లినా
భాష తెలుగు!

దోసపాటి సత్యనారాయణ

పోయింది ఆమె.

వెనక్కి తిరిగి చూస్తే కొంచె దూరంలో దీపపు క్రీనీడలో కనిపించాడా పీడగాడు. అటూ ఇటూ చూస్తున్న ప్రతిమకి తను ఎక్కడుందో అంతుపట్టలేదు. కంగారుగానూ, అయోమయంగానూ అనిపించింది.

పైన సన్నగా మెరుస్తోంది ఆకాశం. వడివడిగా నడుస్తూనే ఆలోచిస్తోందామె. ఆ ఆగంతకుణ్ణించి ఎలా తప్పించుకోవాలా? అని. మళ్ళీ రోడ్డుదాటి ఎదురుగా ఉన్న సందులోకెళ్ళి... మళ్ళీ ఎడమవైపు తిరిగి నడక సాగిం చింది.

వెనక మనిషి అనుసరిస్తూనే ఉన్నాడు. ఎలా ఈ పీడని విరగడ చేసుకోవటం? శ్రావ్య ఇంటి పరిసరాలు దాటి పోయానేమోననిపించింది. బుఱ్ఱ పనిచెయ్యటం మానేసింది ప్రతిమకి.

పోనీ... ఇంటికెళ్ళిపోదామంటే... అసలు తనక్కడుందో కూడా తెలవటంలేదే!... హఠాత్తుగా కరెంటు పోయింది. రాయి తగిలిపడబోయి నిలదొక్కుకుంది ప్రతిమ. అకస్మాత్తుగా ఆమెకొక ఆలోచన వచ్చింది. ఆ క్షణంలో కనిపించిన గేటుతీసుకుని గబగబా లోపలికెళ్ళిపోయింది. ముందికి నడుస్తూ వెనుతిరిగి చూస్తే కాంపౌండ్ వాల్ దగ్గరగా నుంచుని కనిపించాడు ఆ పీడగాడు.

'ఇదెవరిదో తమ కాంపౌండ్‌ని పోలి ఉందే...!' అనుకుంటూ పక్కగా కనిపించిన గదిలోకి దూరి తలుపు జారవేసుకుంది. ఎలాగో కొద్ది నిమిషాలు ఈ గదిలో తల దాచుకుంటే... వాడు కొంతసేపు వేచిచూసి వెళ్ళిపోతాడు... ఆ తర్వాత తను మెల్లగా బయటపడి ఇల్లు చేరవచ్చును'' అనుకుని ధైర్యం తెచ్చుకుంది. కొంచెం తొంగిచూసి ఆ పీడగాడు అక్కడే కాపుకాసి ఉన్నాడని తెలుసుకుని లోపలికి తప్పుకుంది.

అతికష్టమ్మీద ఐదారు నిమిషాలు గడిచాయి. ఇంతలో కరెంటు వచ్చి సూచన తెలిసింది. ఆ ఇంట్లో సందడి మొదలైంది.

ఈ ఇంట్లో వాళ్ళ కంట పడకుండా ఆ 'పీడగాడు'న్నాడో పోయాడో తెలుసుకోవాలి. ఎలా? లైటు వెలుగుతోందే... ఎవరైనా తనని చూసి దొంగతనానికి వచ్చానని అనుకుంటే? చటుక్కున ప్రతిమకి తల్లి అన్న మాట గుర్తొచ్చింది.

'అమ్మా చీకటిపడ్డాక బయటికి వెళ్ళ వద్దంటుంది ఇందుకే! నేనేదో పె... ద్ద... ధైర్యస్తురాలిలాగ బయల్దేరాను. ఇబ్బందుల్లో చిక్కుకున్నాను. అమ్మ ఎంత కంగారు పడుతోందో ఏమో! ఇటు ఇంట్లోనూ లేను... అటు శ్రావ్య-కావ్యల ఇంట్లోనూ లేకుండా ఎవరిదో తెలియని పరాయి పంచలో తలదాచుకుని క్షణాలు గంటల్లా గడుపుతూ... ఛీ... ఏం ఖర్మిది?'' ప్రతిమకి దుఃఖం రాబోయింది. బలవంతాన ఆపుకుంది.

గభాలున తలుపు తెరిచారెవరో... ఏం చెయ్యాలో

## తల్లిదండ్రులు

కోప్పడే నాన్న
వేసవిలో
మండే సూర్యుళ్ళా-
అనునయించే అమ్మ
పున్నమి వెన్నెల చంద్రుళ్ళా

## ఆహ్వానం

కవిత్వ పత్రికలు
నా చిరునామా
వెతుక్కుంటూ
మా ఇంటికొస్తాయి
పెళ్ళిపత్రికల్లా
'స్త్రీలకు ప్రయాణం' అన్నట్లు
ఆహా! నా కవితకు ప్రయాణం!!

## యస్పీ

బప్పీ బాల సుబ్రహ్మణ్యం
భారీదేహుడు
ఆజానుబాహుడు
దేశంపట్టనంత
గొప్ప 'గళా'కారుడు
అయినా
నాకు పాటల పోటీల్లో
పాటలకంటే
ఆయన మాటలే ఇష్టం!

జోరా శర్మ

## నాయకుడు

పదవి లేని
నాయకుడా!
మంత్ర దండంలేని
మాయలఫకీరే!?

## అభివృద్ధి

విద్యాలయాలు
క్షణక్షణాభివృద్ధి
నిరుద్యోగం
దినదినాభివృద్ధి!!

## వైఎస్సార్

తెలుగు ఠీవి ఉట్టిపడే
పంచెకట్టు!
నగుమోము చేసే
కనికట్టు!!

## స్వయంవరం

పూర్వం రాకుమార్తెల
వివాహాలకు స్వయంవరాలు!
నేడు సినీభామల
టీ.వీ. స్వయంవరాలు!!

## చరిత్ర

నేటి తాజా కబురు
రేపటికి చద్దివార్తే!
ఒకనాటికి
అదే 'చరిత్ర'మరి!!

## దంపతులు

నూతన దంపతులు
ఇనుము-అయస్కాంతమే!
పిదపే
నిప్పు-ఉప్పూనూ!?

## ఉగ్రవా(వ్యా)దు(ధు)లు

ప్రపంచ దేశాల్ని కుదిపేస్తున్న
ఉగ్రవాదులు!
ప్రజల్ని పీడిస్తున్న
'స్వైన్ ఫ్లూ' వంటి
ఉగ్రవ్యాధులు!!

ముగడ రామకృష్ణ

తెలియక గుండెలు దడదడలాడుతుండగా వెనక్కి తిరిగి నుంచుంది ప్రతిమ.

''ప్రతీ... ఈ చీకట్లో నుంచుని ఏం చేస్తున్నావ్?'' అంటూ అడిగిన ఆ కంఠస్వరం విని గుర్తించిన ప్రతిమ ఆశ్చర్యానందాలతో ''వదినా!'' అంటూ ఆమెను కౌగిలించుకుని ఆపుకోలేని దుఃఖంతో వెక్కి వెక్కి ఏడ్చేసింది.

''నువ్వు ఫ్రెండ్ ఇంటికి వెళ్ళావని,ఇంకా ఇంటికి రాలేదనీ మీ అమ్మ విసుక్కుంటున్నారు. అందరం నీకోసం ఆతృతగా ఎదురుచూస్తుంటే... నువ్వేమిటి... ఇలా సామాను గదిలో... ఏడుస్తూ... నాకేమీ అర్థంకావటం లేదు'' ప్రతిమ వెన్ను నిమురుతూ అనునయించిందామె వదిన. నిజంగానే ఆమెకు ఆశ్చర్యంగా ఉంది.

నెమ్మదిగా తనను తను సంబాళించుకుంది ప్రతిమ. ధైర్యంగా బయటికి వచ్చి వీధివైపు చూసింది. హడావిడిగా నడచిపోతున్న ఆ పీడగాణ్ణి చూసి 'తోక ముడిచాడు వెధవ' అనుకుంది కసిగా.

ఇంట్లోవాళ్ళకి అంతా వివరించి ''మనిల్లులాగే ఉంది కాంపౌండ్ అదీను... అనుకున్నానే గాని... మనిల్లే- అని తెలియలేదు. తెలిస్తే దాక్కోవాల్సిన ఖర్మేమిటి?''

''పెద్దల మాట చద్దిమూట' అన్న నానుడికి సరైన అర్థం ఇప్పటికిగాని నాకు అవగాహన కాలేదు.అబ్బ! ఎంత టెన్షన్ పడ్డాను? నేను పడిన కంగారు, భయం జన్మలో మర్చిపోలేను!' గుండెమీద చెయ్యివేసుకుని నిట్టూరుస్తూ అంది ప్రతిమ. కావ్య, శ్రావ్యలను కలుసుకున్నప్పుడు ఈ సంఘటనని చిలువలు పలువలు చేర్చి ఎలా వర్ణించి చెప్పాలో... సస్పెన్స్ చెడకుండా ఎలా చెప్పాలో ప్లాన్ చేసుకుంటూ 'ఓ... మైగాడ్! భయాందోళనలతో... చచ్చి బతికాను'' ఒళ్ళు జలదరిస్తుండగా అనుకుంది ప్రతిమ. ■